ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 19 మార్చి 2025

ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 24.0



పోటాపోటీ

తాడిపత్రి నియోజకవర్గంలోని రెండు మండలాల పేర్లలో తొలి అక్షరాలు ఒకేలా ఉంటాయి. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు పోలీస్ అధికారులు అక్రమార్జనలో పోటీ పడుతున్నారని అంటున్నారు. ఈ ప్రాంతంలో ఇసుక వ్యవహారం బాగా నడుస్తోంది. పంచాయితీలు, అసాంఘిక వ్యవహారాల ద్వారా బాగానే సంపాదిస్తున్నారని అంటున్నారు. తాడిపత్రి పరిధిలో ఓ ఎస్ఐ చిన్న చిన్న పంచాయితీల పేరుతో పైసలు వసూలు చేస్తుంటారట. వాటికి సమీపంలోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలోలో పేకాట ముమ్మరంగా సాగుతోంది. సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు నెల మామూళ్లు వెళుతున్నాయని సమాచారం. బాధితులు స్టేషన్‌కు వెళితే.. కేసు కడితే నాకేంటి..? అని అడుగుతారట అక్కడి అధికారి. ఆయన వద్ద పైసలే మాట్లాడతాయని అంటున్నారు.

జిల్లాలో కొందరు సీఐలు, ఎస్ఐలకు జీతం చాలడం లేదేమో..! అందుకే పంచాయితీలు చేస్తున్నారు. స్టేషన్‌కు వచ్చేవారిని బాధితులుగా కాకుండా.. కస్టమర్లుగా చూస్తున్నారు. కాసులు రాలేలా ఉంటేనే పలకరిస్తున్నారు. లేదంటే ఏదో ఒకటి చెప్పి పంపుతున్నారు. ఫలితంగా ప్రతి సోమవారం డీపీఓలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 130 నుంచి 140 ఫిర్యాదులు వస్తున్నాయి.

జీతాలు చాల్లేదు మరి..!

వీటిలో కొన్ని ఫిర్యాదులు రెండు, మూడుసార్లు వచ్చినవీ ఉంటున్నాయి. నార్పలకు చెందిన ఓ మహిళ దొంగతనంపై నాలుగోసారి ఎస్పీని కలిశారంటే పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. ఉన్నతాధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లకు రెఫర్ చేసి వదిలేస్తున్నారు. అలా కాకుండా, బాధితులు జిల్లా కేంద్రం వరకూ రావాల్సిన దుస్థితి ఎందుకొచ్చింది అని ఆలోచిస్తే.. సమస్యలు క్షేత్రస్థాయిలోనే పరిష్కారమౌతాయి.

నెల మామూళ్లు ఇస్తే చాలు.. బియ్యాన్ని అక్రమంగా తరలించుకోవచ్చు. మద్యం దుకాణదారులు నిబంధనలను గాలికి వదిలేయొచ్చు. పేకాట స్థావరాలు పెట్టుకుని.. ఎన్ని ముక్కలాటలైనా ఆడుకోవచ్చు. దొంగతనాలు, ఆత్మహత్యలు, గొడవలు.. ఇలా ఏ నేరం జరిగినా పంచాయితీ పెడతారు. కేసు కట్టకుండా సెటిల్మెంట్ చేసి పంపుతారు. కాసులు రాలవని తెలిస్తే.. ఆ కేసుల గురించి పెద్దగా పట్టించుకోరు. ఛేదించని దొంగతనం కేసులూ ఈ జాబితాలో ఉన్నాయి..! కనిపించే మూడు సింహాలు నీతికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపాలే..! కానీ కొన్ని స్టేషన్లలో నాలుగో సింహం అవినీతికి ప్రతిరూపంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అలాంటి స్టేషన్‌లలో కొన్నింటి గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం



సింహం గడ్డి మేస్తే..!



జీతం చాల్లేదా ఏమిటి..!

- పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు
- వసూళ్లలో కొందరు పోలీసులు బిజీ
- రేషన్ బియ్యం దందా, మద్యం, పేకాటకు అండ
- గాడితప్పిన కొందరు సీఐలు.. ఎస్ఐలు.. సిబ్బంది

అనంతపురం-తాడిపత్రి రహదారి మధ్యలో వచ్చే నియోజకవర్గ కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ బాగా మేస్తున్నారు. స్టేషన్ పరిధిలోని మూడు వైన్ షాపుల నుంచి నెలకు రూ.50 వేలు అందుకుంటున్నారు. ఆ ప్రాంతంలో ఇసుక బాగా దొరుకుతుంది. అది కూడా ఆయనకు ఆదాయం తెచ్చిపెడుతోంది. జిల్లా కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలించే ట్రాక్టర్లు, టిప్పర్లు ఒప్పందం చేసుకుని మరీ డబ్బులు పంపిస్తారట. అక్కడ ఓ కీలక ప్రజాప్రతినిధి చెప్పిన ప్రతి పనీ ఆయన చేసిపెడతారట. ఆ సర్కిల్ పరిధిలో మరో ముఖ్య ఆదాయం పేకాట. చూసీ చూనట్లు ఉండేందుకు పేకాట నిర్వాహకులు నెల నెలా పంపే మొత్తం రూ.లక్షల్లో ఉంటుందని సమాచారం. అక్కడే పనిచేస్తున్న ఓ కిందిస్థాయి అధికారి చిన్న చిన్న మొత్తాలకూ కక్కుర్తి పడతారట. హైవేలో వెళ్తున్న వాహనాలను సైతం ఆయన వదలరని సమాచారం. ఈయన నియోజకవర్గ కేంద్రంలో ఉండకుండా, పక్క మండలంలో ఎక్కువగా పంచాయితీలు చేస్తుంటారని ప్రచారం ఉంది.

ఇసుక.. మందు.. పేకాట

ఎవరూ తగ్గరు..

- అనంతపురం సబ్ డివిజన్ పరిధిలో అక్రమ ఆదాయం కోసం కొందరు పోటీ పడుతున్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో అధికారి ఇదివరకు ఇసుక విషయంలో బాగా సొమ్ము చేసుకున్నారని సమాచారం. ప్రస్తుతం పంచాయితీలపై ఎక్కువగా దృష్టి పెట్టారు. సొమ్ము చేసుకోవడంలో బిజీగా ఉన్నారట.
- ఆలమూరు సమీపంలో ఓ వ్యక్తి భారీ స్థాయిలో చౌకధరల దుకాణం బియ్యం సరఫరా చేస్తుంటాడు. ఇతని నుంచి ప్రతి నెలా పోలీసులకు నెల మామూళ్లు వెళ్తుంటాయని సమాచారం. సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే ఓ అధికారి బాగానే పంచాయితీలు చేస్తూ ముడుపులు పుచ్చుకుంటారు. గతంలోనూ అక్కడే పనిచేయడంతో ఈయనకు పరిచయాలు బాగానే ఉన్నాయి. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య కేసును పంచాయితీ చేసి రూ.3 లక్షలు తీసుకున్నారు. ఈ సొమ్ములో స్టేషన్ సిబ్బందికి వాటా కింద 'బిర్యానీ' తినిపించినట్లు సమాచారం.
- యూనివర్సిటీలకు సమీపంలో ఉండే ఓ పోలీస్‌స్టేషన్‌కు ఇసుక అక్రమ రవాణా ఆదాయం బాగా అందుతోందనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడ ఓ హెడ్ కానిస్టేబుల్ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నాడు. ఓ సీఐ హయాంలో ఆయన భూ వ్యవహారాల్లో బాగా జోక్యం చేసుకునేవారని, పంచాయితీలు, వసూళ్లలో కీలకంగా పనిచేశాడని సమాచారం.

మీకు మేము.. మాకు మీరు..

కళ్యాణదుర్గం పరిధిలో పేకాట, మట్కాకు అడ్డే లేదు. నిర్వాహకులు పోలీసులకు భారీగా ముడుపులు పంపతున్నారని సమాచారం. కీలకమైన ఓ సర్కిల్‌లో పనిచేసే అధికారి అవినీతి అంతా ఇంతా కాదని అంటున్నారు. ఓ కేసు విషయంలో ఓ వ్యక్తి నుంచి రూ.40 వేలు వసూలు చేశారు. మట్కా బీటర్లుగా పేరుగాంచిన ఇద్దరి నుంచి రూ.లక్ష వరకు పిండుకున్నారు. తాజాగా ఓ పంచాయితీ చేసి రూ.3 లక్షలు గుంజారు. సమీపంలోని మరో పోలీస్ స్టేషన్‌లో సీఐ సర్‌కు ఓ కానిస్టేబుల్ నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్నాడు. మట్కా, పేకాట సహా అన్ని అసాంఘిక వ్యవహారాలు ఆ కానిస్టేబుల్ కనుసన్నల్లోనే జరుగుతుంటాయట. ఓ పోలీస్‌స్టేషన్ పక్కనే రేషన్ బియ్యం అక్రమంగా తరలించే మహిళ ఉంటారు. 'మీకు మేము.. మాకు మీరు' అన్నట్లుగా ఆమె దందాకు సహకరిస్తూ.. భారీగా ముడుపులు అందుకుంటున్నారని ప్రచారం ఉంది. పోలీసుల పుణ్యమా అని ఆమె రూ.కోటి వ్యయంతో భవనం నిర్మిస్తున్నట్లు సమాచారం.



కేసులు వద్దు... కాసులే..!

శింగనమల నియోజకవర్గంలో భూముల ధరలు ఆకాశాన్ని తాకే ఓ మండల కేంద్రంలో పనిచేస్తున్న ఎస్ఐ బాగా సంపాదిస్తున్నారు. నాలుగు వైన్‌షాపుల నుంచి ఆయనకు నెలకు రూ.60వేలు అందుతోందని సమాచారం. ఆ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల భూ వివాదం తలెత్తి, ఇరువర్గాలు గొడవపడ్డాయి. ఈ ఘటనలో ఓ హెడ్‌కానిస్టేబుల్‌కు దెబ్బలు తగిలి కిందపడ్డాడు. మరో వ్యక్తి గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. ఇంత జరిగినా కేసు కట్టలేదు. రూ.70 వేలు తీసుకుని సెటిల్ చేశారని సమాచారం. తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఆ ప్రాంతానికొచ్చి అతిగా మద్యం సేవించి గుండెపోటుతో మృతి చెందాడు. గుర్తు తెలియని మృతదేహం అని నమోదు చేసుకుని, పూడ్చిపెట్టారు. కొంతకాలానికి వారి బంధువులు వస్తే, ఆ మృతదేహాన్ని వెలికి తీయించి ఇచ్చేందుకు రూ.30 వేలు పుచ్చుకున్నారు. ఈ మండలంలో కొన్ని తోటలు, గుట్టలు పేకాట స్థావరాలుగా మారిపోయాయి. ఈ శిబిరాల నుంచి నెలకు రూ.లక్ష వరకు ఇస్తారని సమాచారం. ఆ ఎస్ఐ బాధ్యతలుచేపట్టాక ఇక్కడ ఒక్క దొంగతనం కేసునూ ఛేదించలేదు. ఆయన ఎక్కువగా అనంతపురంలోనేఉంటారని సమాచారం.

అక్కడ అంతా ఆయనే....



ఉరవకొండ ప్రాంతంలో ఓ ఎస్ఐ హవా సాగుతోంది. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఇక్కడి పోలీసుల్లో కొందరికి కాసులు కురిపిస్తోంది. ఉరవకొండ నుంచి పావగడకు రోజూ 300 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం తరలిస్తుంటారు. ప్రతి నెలా రూ.లక్షపైగా బేరం నడుస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఓ బియ్యం కేసు వ్యవహారం బయటపడితే... పై అధికారులకు అది సోనామసూరి బియ్యం అని చెప్పి, తప్పించారట. ఆ ఎస్ఐకి ఓ కానిస్టేబుల్ మధ్యవర్తిగా ఉంటూ అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నారని సమాచారం. విడపనకల్లులోనూ రేషన్ బియ్యం వ్యాపారం బాగా నడుస్తోంది. ఉరవకొండ నియోజకవర్గంలోని ఓ మండలంలో వైసీపీ నాయకుడి నేతృత్వంలో పేకాట జోరుగా సాగుతోంది. వైసీపీ నాయకుడికి ముగ్గురు టీడీపీ నాయకులు మద్దతుగా ఉన్నట్లు సమాచారం. చూసీచూడట్లు ఉండేందుకు నెలకు రూ.లక్ష ఇవ్వాలని ఎస్ఐ బేరం పెట్టినట్లు సమాచారం.

ఆ ఇద్దరే కీలకం...

గుంతకల్లు పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో సీఐ కమర్షియల్ వ్యవహారాలు శృతిమించాయని అంటున్నారు. పంచాయితీలు చేయడం.. ముడుపులు పుచ్చుకోవడం ఆయన అలవాటని అంటున్నారు. ఆ పోలీస్ స్టేషన్‌లో అధికార పార్టీ నేతకు బంధువైన హెడ్‌కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ హవా నడిపిస్తున్నారు. ఓ ఆసుపత్రిలో ఓ వ్యక్తి మృతి చెందితే.. యాజమాన్యం నుంచి రూ.50వేలు డిమాండ్ చేసినట్లు సమాచారం.

నగరంలోనూ అంతే..

అనంతపురం వన్ టౌన్ స్టేషన్ చాలా కమర్షియల్. ప్రస్తుత ఎస్పీ, సీఐ రానంతవరకు మట్కా జోరుగా సాగింది. ఇప్పటికీ కొందరు కానిస్టేబుళ్లు వారితో వ్యవహారం నడుపుతున్నారు. సోఫాల పేరుతో పిలిచే ఓ పెద్దమనిషిని మధ్యవర్తిగా వాడుకునేవారు. అతను పంచాయితీలు తెచ్చి జేబులు నింపుకునేవాడు. కొత్త సీఐ వచ్చాక ఆ ప్రభావం తగ్గినట్లు సమాచారం. ఇప్పటికీ దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఓ ఏఎస్ఐ, మిస్సింగ్ కేసులొస్తే వెళ్లే ఓ కానిస్టేబుల్, ఏఆర్ నుంచి వచ్చిన కానిస్టేబుల్, మరో హెడ్‌కానిస్టేబుల్ కీలకంగా ఉన్నట్లు సమాచారం. సమీపంలోని స్టేషన్ నుంచి వచ్చిన ఓ అధికారి చిన్న చిన్న వ్యవహారాల్లో రూ.10 వేలకు తక్కువ కాకుండా పుచ్చుకుంటారని సమాచారం. స్టేషన్ పరిధిలోని వైన్‌షాపులు (నేతలవి కాకుండా), డాబాల నుంచి నెల మామూళ్లు తప్పనిసరిగా వెళ్లాల్సిందే అంటున్నారు. త్రీటౌన్‌లో న్యాయవాది శేషాద్రి మృతి చెందక ముందు కొన్ని పంచాయితీల ముసుగులో ముడుపులు పుచ్చుకునే వారు. అక్కడ కీలకంగా ఉండే ఓ కానిస్టేబుల్‌ను బదిలీ చేశారు. ఇప్పుడు అక్కడ ఓ ఏఎస్ఐ, మరో హెడ్‌కానిస్టేబుల్ చక్రం తిప్పుతున్నారట. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తరచూ జరిగే పంచాయితీలతో కొందరు జేబులు నింపుకుంటున్నారట. ఇక అక్కడ డాబాలకు లెక్కేలేదు. హైవే మొత్తం అవే ఉన్నాయి. వాటి నుంచి ప్రతినెలా మామూళ్లు వస్తుంటాయి.

పరీక్షల విభాగం భ్రష్టు..!

- విధుల కేటాయింపులో ఇష్టారాజ్యం
- సీనియర్లను కాదని.. జూనియర్లకు..
- గ్రూపు రాజకీయాలు.. అక్రమాలు
- ఓ ఉన్నతాధికారి వ్యవహారంతో సమస్యలు
- కమిషనరేట్.. ఆర్జేడీ లోతైన దర్యాప్తు..?



పరీక్షల విభాగం ఉండే పాత డీఈఓ కార్యాలయం

అనంతపురం విద్య, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలోని పరీక్షల విభాగం భ్రష్టుపట్టిందన్న విమర్శలు వస్తున్నాయి. డీఈఓను బేఖాతరు చేస్తూ.. ఆ శాఖలోని ఓ ఉన్నతాధికారి పరీక్షల విభాగాన్ని స్వతంత్ర వ్యవస్థలాగా నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన మోనార్క్ వైఖరి, అడ్డగోలు వ్యవహారాలు, ఇష్టారాజ్య నిర్ణయాలు, గ్రూప్ రాజకీయాలతో పరీక్షల విభాగం నిర్వీర్యమైందని అంటున్నారు. పరీక్ష కేంద్రాల ఎంపిక, ఇన్విజిలేటర్లు, సీఎస్, డీఓల నియామకం, స్పాట్ డ్యూటీలు.. ఇలా ప్రతి అంశంలోనూ ఏటా వివాదాలు తలెత్తుతున్నాయి. అనుభవజ్ఞులైన హెచ్‌ఎంలను కాకుండా జూనియర్ల నియమించడం వల్లే పరీక్షలు పరిహాసంగా మారుతున్నాయి. రాయదుర్గంలో పది ఓపెన్ పరీక్షల్లో హిందీ ప్రశ్నాపత్రం గల్లంతు కావడం దీనికి నిదర్శం. ఈ వ్యవహారాలపై కమిషనరేట్, ఆర్జేడీ లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. త్వరలో ఆ విభాగం ప్రక్షాళన ఖాయమని పలు ఉపాధ్యాయ సంఘాలు, విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి.

గ్రూప్ రాజకీయాలు

జిల్లా పరీక్షల విభాగాన్ని కొన్నేళ్లుగా గ్రూప్ రాజకీయాలు శాసిస్తున్నాయి. ఆ విభాగంలో పనిచేసే ఓ ఉన్నతాధికారి తన చెప్పు చేతుల్లో ఉన్న టీచర్లకు పెద్ద పీట వేస్తున్నారు. వారికి కీలకమైన పరీక్షల విధులు వేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కొందరిని గ్రూపులుగా విభజించి, చక్రం తిప్పుతున్నారని ప్రచారం ఉంది. ప్రతిచోటా తనవాళ్లు ఉంటే.. ఎక్కడ ఏం జరిగినా బయటకు పొక్కదని ఆయన ఆలోచన అంటున్నారు. పరీక్షల డ్యూటీలు వేసే క్రమంలో విద్యాశాఖను పక్కకు నెట్టేసి తన సొంత నిర్ణయాలను అమలు చేస్తున్నారు. ఫలితంగా ఇన్విజిలేటర్ల డ్యూటీల్లో గందరగోళం నెలకొంటోంది. అందులు, విశ్రాంత ఉపాధ్యాయులకూ విధులు కేటాయించిన చరిత్ర ఉంది. డబుల్ ఆర్డర్లు కూడా ఇచ్చారు. ఈ డ్యూటీ వేసే ఫైల్ సైతం డీఈఓ ఆఫీస్‌లో సంబంధిత సెక్షన్‌కు వెళ్లకుండా పై స్థాయిలోనే నడిపించారన్న విమర్శలు ఉన్నాయి. ఆ విభాగంలోని ఒక ఉన్నతాధికారి పరీక్షల విభాగంలో ఇతరుల ప్రమేయం ఉండకూడదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అంతా తానే అంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

జూనియర్లకే పగ్గాలు

విద్యార్థుల జీవితంలో పదో తరగతి పరీక్షలు కీలకం. అలాంటి ముఖ్యమైన పరీక్షల విధులకు సీనియర్ ప్రధానోపాధ్యాయులను సీఎస్, డీఓలుగా నియమించాలి. ఇతర విధుల్లో సైతం వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ కొంతకాలంగా పరీక్షల విభాగానికి సీనియర్ ప్రధానోపాధ్యాయులను దూరం చేశారు. జూనియర్లను, అనుభవం లేని టీచర్లను సీఎస్, డీఓలుగా నియమించారు. రాయదుర్గంలో ప్రశ్నాపత్రాల బండిల్ మిస్సింగ్‌కు ఇదే కారణమని స్పష్టమవుతోంది. రాయదుర్గంలో నాలుగు ఓపెన్ పరీక్ష కేంద్రాలు ఉండగా.. సీఎస్, డీఓ, సిట్టింగ్ స్క్వాడ్‌గా సీనియర్ ప్రధానోపాధ్యాయులను వేయకుండా ఎస్‌జీటీలు, పీడీలు, లాంగ్వేజ్ పండిట్లను నియమించారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

డీఈఓ దృష్టి పెట్టకుంటే..

పరీక్షల వ్యవహారాన్ని ఆ విభాగం ఉన్నతాధికారికే వదిలేసినా.. పది పరీక్షలపై డీఈఓ శ్రద్ధ పెట్టకుంటే ఇబ్బందులు తప్పేలా లేవని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ అధికారులు ఆది నుంచి అంటున్నారు. 2019లో ఇష్టారాజ్యంగా 10వ తరగతి డ్యూటీలు వేయడంతో అప్పటి కమిషనర్ విచారణకు ఆదేశించారు. ఒక జాయింట్ డైరెక్టర్‌తో విచారణ చేయించడంతో అక్రమాలు నిజమని తేలాయి. తెరవెనుక వ్యవహారం నడిపించి, పరీక్షల విభాగంలోని ఒక అధికారి తెలివిగా తప్పించుకున్నారు. కానీ అప్పటి డీఈఓ బలి అయ్యారు. అప్పటి డీఈఓను నాటి కమిషనర్ సరెండర్ చేశారు. ఇప్పుడు కూడా అలాంటి అక్రమాలు, పొరపాట్లే జరుగుతున్నాయి. ఇప్పుడు కూడా విద్యాశాఖ కమిషనరేట్, ఆర్జేడీ క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తున్నారు. పరీక్షల విభాగంలోని ఓ ఉన్నతాధికారి వైఖరిపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు. పరీక్షల విభాగం ప్రక్షాళన ఖాయమని భావిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.32 (బుధవారం సాయంత్రం)

సెహరీ : 5.08 (గురువారం ఉదయం)

ఆటలు.. పాటలు

సరదాగా గడిపిన ఎమ్మెల్యేలు

(వివరాలు 7వ పేజీలో...)

యాడికి 40°

యాడికి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. యాడికిలో మంగళవారం ఏకంగా 40 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆది, సోమవారాల్లో 39 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం. రోజురోజుకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం అయ్యేసరికి రోడ్లమీద ఒక్కరూ కనిపించడం లేదు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగవచ్చునని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో ఆరుబయట పనులు చేసేవారు, వాహనాల్లో ప్రయాణించే వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రేపు డ్వామా ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డ్వామా ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు పీడీ సలీం బాషా మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 160 మంది ఉద్యోగులు బదిలీ కోసం ఆప్షన్ పెట్టుకున్నారన్నారు. వారికి కౌన్సెలింగ్‌కు సంబంధించిన సమాచారం అందించామన్నారు. ఇందులో 11 మంది ఏపీఓలు, 98 మంది టీఏలు, 51 మంది కంప్యూటర్ ఆపరేటర్లు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చారన్నారు. 20న డ్వామా కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి, 22వ తేదీ లోపు బదిలీ స్థానాల్లో ఉద్యోగులు చేరాల్సి ఉంటుందని పీడీ పేర్కొన్నారు.

లక్ష్మీనృసింహుడి పాదాలను తాకిన సూర్యకిరణాలు



లక్ష్మీనరసింహస్వామిని తాకిన సూర్యకిరణాలు

గుత్తి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పాదాలను మంగళవారం సూర్యకిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు. ఏడాదిలో రెండుసార్లు స్వామి వారిని సూర్యకిరణాలు తాకుతాయని అర్చకులు తెలిపారు.



సీసీఆర్‌సీ కార్డుల జారీ తీరిదీ..

సంవత్సరం	జారీ చేసిన కార్డుల సంఖ్య
2019 - 20	2160
2020 -21	831
2021 -22	2022
2022- 23	2149
2023-24	6960
2024-25	8382

కౌలు కష్టాలు

కొందరికే గుర్తింపు కార్డులు



అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కౌలు రైతు కష్టాలు వర్ణనాతీతం. కౌలు కట్టుకుంటాడు. సేద్యం పనులన్నీ స్వంతంగా చేసుకుంటాడు. పంట దెబ్బతింటే పెట్టుబడి, ఆరుగాలం శ్రమ, కౌలు డబ్బు సర్వం నష్టపోతాడు. అలాంటి సిసలైన రైతుకు అడుగడుగునా అన్యాయం వాటిల్లుతోంది. కనీసం గుర్తింపు దక్కట్లేదు. ప్రభుత్వ పథకాలు కూడా వర్తింపజేయకపోవడం శోచనీయం. అనంత కౌలు రైతును ఆదుకోవడంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఏటా కౌలు రైతులకు నిబంధనల పేరుతో పంటల సాగుదారుల హక్కు (సీసీఆర్‌సీ) కార్డుల జారీలో కొర్రీలు పెడుతున్నారు. అరకొరగా సీసీఆర్‌సీ కార్డులు అందుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి తగిన పథకాలు వర్తింపజేయడం లేదు. బ్యాంకులు సైతం రుణాలు అందించడంలో తీవ్ర అశ్రద్ధ చూపుతున్నాయి. జిల్లాలో 30వేల మందికిపైగా కౌలు రైతులున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఏటా అరకొరగానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంతో సరిపెడుతున్నారు. వైసీపీ హయాంలో కార్డులు అందుకున్న వారిలో సగంమందికి మాత్రమే రైతు భరోసా డబ్బు జమ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ సొమ్మును ఒక్క కౌలు రైతుకు కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం. సీసీఆర్‌సీ కార్డున్నా ప్రభుత్వ పథకాలు వర్తించకపోవడంతో బాధిత కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు భూమిలో పంటలు సాగు చేసి, పంట నష్టం వాటిల్లినా రైతులకు పరిహారం వర్తింపజేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వచ్చే ఖరీఫ్ నుంచైనా అర్హత కలిగిన కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, రైతు భరోసా, పీఎం కిసాన్, పంటనష్టపరిహారం, పంటల బీమా వర్తింపుతోపాటు బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- అరకొరగా సీసీఆర్‌సీ కార్డుల జారీ
- 2024-25లో 68మందికే బ్యాంకు రుణాలు
- గత ప్రభుత్వం తెచ్చిన నిబంధనలతో ఇక్కట్లు
- రైతు భరోసా, ప్రభుత్వ పథకాల వర్తింపుపై నిర్లక్ష్యం
- వచ్చే ఖరీఫ్ నుంచైనా న్యాయం చేయాలని వేడుకోలు

నిబంధనలతో ఇక్కట్లు

గత వైసీపీ సర్కారు 2019లో పంటల సాగుదారుల హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ఈ చట్టంలో భూమి యజమాని అంగీకారం ఉంటేనే కౌలు రైతుకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్న నిబంధన పెట్టారు. తమ భూమి కౌలుకు తీసుకునే రైతులకు అంగీకారపత్రం రాసిస్తే తమకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్న కారణంతో భూమి యజమానులు సంతకం పెట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. అంగీకార పత్రం అడిగితే కౌలు రద్దు చేస్తామంటూ షరతులు పెట్టారు. దీంతో నిజమైన కౌలు రైతులకు అన్యాయం వాటిల్లుతోంది. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతుల రక్షణ కోసం ఏపీ భూ అధీకృత రైతుల చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ చట్టం మేరకు భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను గుర్తించేది. సంబంధిత అధికారులు.. గ్రామసభలు ఏర్పాటు చేసి, అసలైన కౌలు రైతులను గుర్తించి, కార్డులు జారీ చేసేవారు. 2014-19 మధ్యకాలంలో కౌలు రైతులకు రుణ మాఫీని వర్తింపజేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు పాత చట్టాన్ని రద్దు చేసింది. కొత్త చట్టం మేరకు కౌలు రైతులకు గతంలో కంటే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని అప్పటి పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. భూయజమాని సంతకం తప్పనిసరి చేయడంతో కౌలు రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. జిల్లాలో దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయడం లేదు. దీంతో పంట నష్టం వాటిల్లితే ఆయా కౌలు రైతులు ప్రభుత్వ లబ్ధికి దూరమవుతున్నారు. వైసీపీ సర్కారు తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేసి, భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

అర్హులందరికీ సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలి



జిల్లాలో కౌలు రైతులకు అరకొరగా సీసీఆర్‌సీ కార్డుల జారీతో అధికారులు సరిపెడుతున్నారు. ఇప్పటిదాకా 68 మందికి మాత్రమే బ్యాంకు రుణం ఇవ్వడం దారుణం. సీసీఆర్‌సీ కార్డులున్న రైతులకు బ్యాంకు రుణం ఇవ్వడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచైనా అర్హత కలిగిన ప్రతి రైతుకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసి, బ్యాంకు రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-రంగారెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

68 మందికే బ్యాంకు రుణం

2024-25 సంవత్సరంలో 8,382 మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. వీరిలో 1,741 మందికి రుణ మంజూరుకు అర్హత ఉన్నట్లు ఎస్ఎల్‌బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ) గుర్తించింది. 2024-25 ఖరీఫ్‌లో 68 మందికి రూ.39.55 లక్షల బ్యాంకు రుణం మంజూరు చేయడంతో సరిపెట్టారు.

ఆ చట్టాన్ని రద్దు చేయాలి



భూయజమాని సంతకం ఉంటేనే సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలంటూ వైసీపీ సర్కారు తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి. పాత పద్ధతిలోనే భూయజమాని సంతకం అవసరం లేకుండానే అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి, కౌలు రైతులను గుర్తించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కార్డులు జారీచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌలు రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్, బ్యాంకు రుణాలు, పంటనష్టపరిహారం, పంటల బీమా తదితర పథకాలను వర్తింపజేయాలి. దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి, ఆదుకోవాలి.

- బాలరంగయ్య, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

అటవీ శాఖాధికారుల మెడకు నకిలీ చలానాల ఉచ్చు

నోడ్యూస్ జారీ చేయని ఉన్నతాధికారులు

రిటైర్మెంట్ సమయంలో తిప్పలు

రికవర్రీ..!

అటవీశాఖ జిల్లా కార్యాలయం



అటవీ శాఖాధికారుల మెడకు నకిలీ చలానాల ఉచ్చు బిగుసుకుంది. ఉద్యోగ విరమణ సమయంలో సమస్యలు తెచ్చిపెట్టింది. స్వాహా అయిన సొమ్ము రికవరీ అయ్యేవరకు నోడ్యూస్ జారీ చేయమని ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో సంబంధిత అధికారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. -ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

అటవీశాఖ జిల్లా కార్యాలయంలోని అనంతపురం రేంజ్ పరిధిలో గతంలో అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తాయి. అటవీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వారిని పట్టుకుని, జరిమానా వేసి, ఆ సొమ్ము చలానాల రూపంలో ప్రభుత్వానికి చెల్లించేలా ఫైల్ రెడీ చేసి పంపారు. సొమ్ము కట్టించుకునే కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేసు వివిధ అకౌంట్లకు ఫోన్ పే ద్వారా సొమ్ము మళ్లించుకుని, నకిలీ చలానాలతో స్వాహా చేస్తూ వచ్చాడు. కార్యాలయంలోని సిబ్బందిని మామూళ్లతో మేనేజ్ చేశాడన్న ఆరోపణలున్నాయి. అలా 2019 నుంచి 2023 వరకు రూ.15 లక్షలుపైగా జేబులోకి వేసుకున్నాడు. ఆడిటింగ్‌లో ఈ అక్రమం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంకటేసుపై పోలీసులకు ఫిర్యాదు చేసి, జైలుకు పంపారు. గుత్తి, అనంతపురం రేంజ్‌లలో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఆ సమయంలో గుత్తిరేంజ్ ఎఫ్ఎస్ఓగా కొనసాగి ప్రస్తుతం ముదిగుబ్బలో పనిచేస్తున్న ఐజాక్‌బాబు ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయనకు నోడ్యూస్ సర్టిఫికెట్ జారీ చేయకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లో గుత్తి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన అయూబ్ బాషా పేరున కూడా మూడు నకిలీ చలానాలు వెలుగుచూశాయి. ఆయన చనిపోవడంతో కుటుంబీకులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశం కల్పించారు.

అక్రమాల పర్వం ఇలా..?

అప్పట్లో ఆత్మకూరు సెక్షన్ ఆఫీసర్‌గా ఉండి ప్రస్తుతం కుప్పం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్వో)గా ఉన్న పుల్లయ్య, ప్రస్తుతం అనంతపురం రేంజర్ శ్రీనివాసులు జూన్‌లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. వీరికి కూడా నోడ్యూస్ ఇచ్చే అవకాశం లేదు. అప్పట్లో రేంజర్‌గా ఉన్న సూర్యచంద్రరాజు ప్రస్తుతం డోన్ సబ్‌డీఎఫ్ఓగా ఉన్నారు. ధర్మవరం డీఆర్వోగా ఉండి శ్రీశైలానికి రేంజర్‌గా బదిలీ అయిన రామకోటికి నోడ్యూస్ సమస్యలు తప్పేలా లేవు. ఇప్పటికే సూపరింటెండెంట్ నుంచి రికవరీకి సంబంధించి సమాచారం అందినట్లు తెలిసింది.





డీఎఫ్ఓకి సమస్యలు చెప్పుకుంటున్న సిబ్బంది (ఫైల్)

త్వరగా సమస్య పరిష్కరిస్తాం

స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి తీరుతాం. అందులో భాగంగానే నోడ్యూస్ జారీ చేయకుండా పెండింగ్ పెడుతున్నాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి సొమ్ము రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నాం.

- విఘ్నేష్, జిల్లా అటవీ శాఖాధికారి

- చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్న వైనం
- నూతన ప్రభుత్వంలోనైనా సమస్యలు తీరేనా?

ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్యమిత్రల ఎదురుచూపు

చిన్న ఆశ

ఉద్యోగ భద్రత కోసం ఆరోగ్య మిత్రలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది దాకా ఆరోగ్యమిత్రలు ఉన్నారు. ప్రభుత్వాలు అరకొర జీతమే ఇస్తున్నా వీరు మాత్రం దండిగా ప్రజాసేవ చేస్తున్నారు. గత ప్రభుత్వ చర్యలతో వీరి ఉద్యోగ జీవితం దిన దిన గండంగా గడిచింది. - ఆంధ్రజ్యోతి, ధర్మవరం

ఆరోగ్య మిత్రలు ఏం చేస్తారంటే..

ప్రతిరోజు తమకు కేటాయించిన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తారు. చికిత్స కోసం వచ్చే రోగుల పేర్లను రిజిస్టర్ చేసి, వారిని సంబంధిత డాక్టర్ వద్దకు తీసుకెళతారు. పరీక్షల అనంతరం వారి వివరాలు రికార్డుల్లో పొందుపరిచి, ఏఏ మందులు ఎలా వాడాలి? ఇంటికి వెళ్లిన తరువాత ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతారు. రోగి ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి డిశ్చార్జి అయ్యేవరకు బాధ్యతంతా ఆరోగ్యమిత్రదే.

ప్రక్షాళన పేరుతో ఇబ్బందులు



గత వైసీపీ ప్రభుత్వం ప్రక్షాళన పేరుతో ఆరోగ్యమిత్రలను తీవ్ర ఇబ్బంది పెట్టినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రూ.13500లే జీతమిస్తూ వెట్టి చాకిరీ చేయించారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం పొమ్మన లేక పొగ పెట్టింది. జిల్లాలో పని చేసే ఆరోగ్య మిత్రలందరినీ మరో జిల్లాకు బదిలీ చేసింది. వారిస్థానంలో సచివాలయ ఏఎన్ఎంలకు బాధ్యతలు అప్పగించాలని కుయుక్తులు పన్నారు. తమకు అన్యాయం జరుగుతోందని గొంతెత్తినా పట్టించుకునేవారు లేకుండాపోయారు. ఎన్నికలు రావడంతో ఆరోగ్యమిత్రలు ఊపిరిపీల్చుకున్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ చాంబర్ (ఫైల్)

కొత్త ప్రభుత్వంపై ఆశ

ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వంపై ఆరోగ్య మిత్రలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ భద్రతతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తోంది. ఇటీవల ఆరోగ్య మిత్రలందరూ ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ప్రధానంగా ఆరోగ్యమిత్రలను పర్మినెంట్ ఉద్యోగులుగా చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వా కోరారు.

వసతిగృహాలకు రూ.1.73 కోట్ల బకాయి

బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇబ్బందులు

సొంత డబ్బుతో కొనాల్సిందేనా..?

కాస్మెటిక్స్ కష్టాలు..!

ఎస్సీ కార్పొరేషన్



సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కాస్మెటిక్స్ కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో సకాలంలో కాస్మెటిక్స్ చార్జీలు అందక నానా అవస్థలు పడ్డారు. సంవత్సరానికిపైగా చార్జీలు అందక విద్యార్థులు సొంతఖర్చులతో కాస్మెటిక్స్ కొనుగోలు చేసి కాలం నెట్టుకొచ్చారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ కాస్మెటిక్ చార్జీలు అందించడంలో అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి సుమారు రూ. 1.73 కోట్లు కాస్మెటిక్ చార్జీలు విద్యార్థుల ఖాతాలకు జమ కావాల్సి ఉంది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

రూ. 1.73 కోట్లు బకాయి

అన్ని వసతి గృహాలకు సంబంధించి విద్యార్థులకు కాస్మెటిక్స్ చార్జీలు మొత్తం రూ.1.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని వసతిగృహాలకు ఏడాదిగా కాస్మెటిక్స్ చార్జీలు అందడంలేదు. జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా... 8027 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరందరికి దాదాపు 2024 నుంచి కాస్మెటిక్స్‌కు బడ్జెట్ కేటాయించలేదు. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ కాస్మెటిక్స్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రీమెట్రిక్ హాస్టళ్లకు రూ. 87.72 లక్షలు నిధులురావాల్సి ఉంది. పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు 2024 ఫిబ్రవరి నెల నుంచి కాస్మెటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ హాస్టళ్లల్లో విద్యార్థులకు రూ. 65.81 లక్షలు బకాయి ఉంది. ఎస్సీ సంక్షేమశాఖకు జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 5791 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి 2024 అక్టోబరు నుంచి ఇప్పటి వరకూ కాస్మెటిక్ చార్జీలు రావాలి. వీటికి సంబంధించి రూ.18 లక్షలు పెండింగ్‌లో పడిపోయాయి. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి జిల్లాలో ఐదు వసతిగృహాల్లో 200 మందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టళ్లకు సంబంధించి గత ఏడాది డిసెంబరు నుంచి రూ. 2.79 లక్షల కాస్మెటిక్ చార్జీలు రావాల్సి ఉంది.

బడ్జెట్ వచ్చింది



కాస్మెటిక్ చార్జీలకు సంబంధించి రూ. 1.52 కోట్లు బడ్జెట్ వచ్చింది. గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ బడ్జెట్ వచ్చింది. త్వరలోనే విద్యార్థుల ఖాతాలకు నగదు జమ అవుతుంది.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

బిల్లులు జనరేట్ అయ్యాయి...



జిల్లాలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించిన గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ బిల్లులు జనరేట్ అయ్యాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి బడ్జెట్ త్వరలోనే రానుంది. బడ్జెట్ రాగానే విద్యార్థుల ఖాతాలకు కాస్మెటిక్ చార్జీలు జమ అవుతాయి.

-రాధిక, డీడీ, ఎస్సీ సంక్షేమశాఖ

బడ్జెట్ ఉంటే... టోకెన్లు రావు...

సంక్షేమ వసతిగృహాల్లో డైట్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీల పరిస్థితి అయోమయంగా తయారయింది. ఒక శాఖకు బడ్జెట్ వస్తే... టోకెన్ నంబర్లు రావు.. మరో శాఖకు టోకెన్ నంబర్లు వస్తే.. ట్రెజరీలో బిల్లులు పెండింగ్‌లో పడిపోతాయి.. మరోశాఖలో బడ్జెట్, టోకెన్ నంబర్లు, ట్రెజరీ తతంగమంతా ముగిసినా... ఆర్‌బీఐ నుంచి క్లియరెన్స్ రాదు... ఇలా సంక్షేమ వసతిగృహాలకు ఆర్థికపరమైన చిక్కులు వీడటం లేదు. ప్రస్తుతం కాస్మెటిక్ చార్జీలకు సంబంధించి బీసీ సంక్షేమశాఖ పరిధిలో బడ్జెట్ వచ్చింది.. కానీ టోకెన్ నంబర్ల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్‌లో బడ్జెట్ రావడంతో పాటు... బిల్లులు జనరేట్ అయ్యాయి. కానీ క్లియరెన్స్ కోసం వేచి చూడాల్సి వస్తోంది.

చూసిన కనులదే భాగ్యము..!

వైభవంగా ఖాద్రీశుడి ప్రజాగరుడ సేవ



గరుత్మంతుడిపై దర్శనమిస్తున్న శ్రీవారు

కదిరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం లక్ష్మీ నరసింహ స్వామి వారు ప్రజాగరుడసేవ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో సోమవారం రాత్రి బయల్దేరిన శ్రీవారు మంగళవారం సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. వెంటనే నిత్య పూజ, హోమం, గ్రామోత్సవం నిర్వహించారు. సంధ్యాసమయంలో గరుడవాహనంపై కొలువుతీరిన శ్రీవారిని దర్శించుకోవడానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. విద్యుత్‌దీపకాంతుల నడుమ శ్రీవారు తిరువీధుల్లో విహరించారు. బ్రహ్మరథోత్సవానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిటకిట లాడుతోంది. వారికి వినోదం పంచడం కోసం ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గజవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు గజవాహనంపై విహ రిస్తారు. ఈవాహనం తరువాత రోజు బ్రహ్మరథోత్సవం జరగనున్నది. శ్రీవారి ఆలయం ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నది. ఐరావతంపై శ్రీవారు భక్తులకు దర్శనమిస్తారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

ఆటో బోల్తా.. 14 మంది కూలీలకు గాయాలు

● చికిత్స పొందుతూ ఒకరి మృతి ● నలుగురి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

తాడిపత్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి 14మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిలో ఒక రు మృతి చెందగా.. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనపై రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్, శ్రీనివాసపురానికి చెందిన కూలీలు నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలం పేరుసోముల గ్రామంలో మిర్చిపంటను కోసేందుకు మంగళవారం తెల్లవారుజామున ఆటోలో వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి అదే ఆటోలోనే తాడిపత్రికి బయలుదేరారు. కాగా సజ్జలదిన్నె గ్రామ సమీపంలోకి రాగానే ఆటో ముందు టైరు పంక్చర్ అయి ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో 14 మంది కూలీలు గాయపడ్డారు. వారిలో రసూల్‌బీ, లక్ష్మిదేవి, శారద, నారాయణమ్మ, బీబీల పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషమంగా ఉన్న ఐదుగురిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రసూల్‌బీ(57) మృతి చెందింది. మృతురాలికి భర్త మహమ్మద్, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్థానిక ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ఆటో డ్రైవర్ అధిక సంఖ్యలో కూలీలను ఎక్కించడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. ఆ ఆటోడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని రూరల్ ఎస్ఐ ధరణీబాబుకు సూచించారు. ఆయన వెంట టీడీపీ ఎస్సీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, యుగంధర్, నీలకంఠ, నరసింహులు, భాస్కర్‌రెడ్డి, విజ్జి, మల్లికార్జున తదితరులు ఉన్నారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

కాశీకి వెళ్తే.. ఇంట్లో చోరీ

● రాచువారిపల్లిలో ఘటన



ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

తనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచువారిపల్లి గ్రామంలో ఉన్న దేశాయి భక్తవత్సలరెడ్డి నివాసంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు గుర్తించారు. దీనిపై ఆ కుటుంబానికి చెందిన సమీప బంధువు దేశాయి సంజీవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తవత్సలరెడ్డి వారం రోజుల కిందట కుటుంబంతో కలిసి కాశీకి వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటి వెనుక వైపున ఉన్న తోటలో నుంచి తలుపుల గడియలు పగలకొట్టి, లోపలికి ప్రవేశించారని పోలీసులు తెలిపారు. ఇంటిలో ఉన్న మూడు బీరువాలు పగలకొట్టి వస్తువులను చెల్లా చెదురు చేశారు. అనంతరం ఇంటి బయట ఉన్న తోటలోకి వచ్చి కొబ్బరికాయలు కోసుకుని తాగి వెళ్లినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న సంజీవరెడ్డి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పోలీస్ క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఈవిషయంపై ఎస్ఐని సంప్రదించగా ఇంటి యజమాని తీర్థయాత్రల్లో ఉన్నారని, ఆయన వచ్చిన తర్వాత ఏమి పోయిందో చెబితేకానీ తెలియదన్నారు.

సజావుగా ప్రమోషన్ల కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించారు. వారికి ఎంపీహెచ్ఓ(ఫీమేల్)గా కేడర్ మార్చి, వైద్యశాఖలోకి విలీనం చేస్తూ ఉద్యోగోన్నతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆరు నెలలుగా ఈ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో సచివాలయాల ఏఎన్ఎంలు ఎదురుచూస్తూ వచ్చారు. ఎట్టకేలకు జిల్లా వైద్యశాఖ గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించింది. మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి ప్రక్రియను పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా సీనియార్టీని తయారు చేశారు. 217 ఖాళీలను చూపారు. తొలుత స్పౌజ్, పీహెచ్ కేటగిరీల వారికి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత జనరల్ కేటగిరీ వారికి కేటాయించారు. మొత్తం 205 మంది సచివాలయగ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఓ(ఎఫ్)గా ఉద్యోగోన్నతులు కల్పించి ఉత్తర్వులు అందజేసారు.

సాంకేతిక నైపుణ్యమే కీలకం: ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక నైపుణ్యమే కీలకమని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని పోలీస్ అధికారులకు సైబర్, ఇతర నేరాలలో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సైబర్ నిపుణులు రామాంజనేయులుతో సైబర్ నేరాల పరిశోధనలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అధిక సంఖ్యలో జరుగుతున్న సైబర్ మోసాలు అరికట్టేందుకు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక నైపుణ్యంతో పాటు శోధన ఎంతో ముఖ్యమన్నారు. నేరాల తీరు మారుతోందని, ప్రతీ నేరం, సైబర్ క్రైం సాంకేతికతో ముడిపడి ఉందన్నారు. ఈ నేరాలను ఛేదించేందుకు ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణ్యం అవసరమన్నారు. దీనిని మెరుగుపరుచుకుంటే సైబర్ నేరాలు ఛేదించవచ్చన్నారు. సమావేశంలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సీఎంతో మహిళా ప్రజాప్రతినిధులు



అరకు కాఫీతో ఆరోగ్యం



అసెంబ్లీ ఆవరణలో జిల్లాకు చెందిన మహిళా ఎమ్మెల్యేలు అరకు కాఫీ టేస్ట్ చూశారు. అరకు కాఫీ తాగితే ఆరోగ్యంగా ఉండవచ్చని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు.

స్నేహమంటే ఇదేరా...



ఆటలు.. ఫొటోలు

సరదాగా గడిపిన ఎమ్మెల్యేలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

బడ్జెట్ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అసెంబ్లీ ఆవరణలో మంగళవారం ఫొటో షూట్ నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, శాసన మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, మంత్రులతో ఫొటోలు దిగారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, జేసీ అశ్మిత్‌రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరా రెడ్డి ఫొటో షూట్‌లో పాల్గొన్నారు.

క్రీడాపోటీలు

విజయవాడ ఇందిరా గాంధీ క్రీడా మైదానంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ పోటీలలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. స్పీకర్ లెవెన్ వర్సెస్ సీఎం లెవెన్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో స్పీకర్ లెవెన్ జట్టు తరఫున అమిలినేని పాల్గొన్నారు. షటిల్ పోటీలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ జట్టు విజేతగా నిలిచింది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు ఒక జట్టుగా, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఒక జట్టుగా తలపడ్డారు.



ఫొటో.. ఓ మైలు రాయి: సింధూర



కొడితే సిక్సే..



శాసనసభ ఫొటో సెషన్ తన జీవితంలో ఓ మైలురాయి అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. అతిపిన్న వయస్సులో, తన మామ పల్లె రఘునాథరెడ్డి ఆశీస్సులతో ప్రజలు తనకు పెద్ద బాధ్యతను అప్పగించారని అన్నారు. పుట్టపర్తి తొలి మహిళా ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని అన్నారు. వైసీపీ సభ్యుల తీరు మినహా శాసన సభ సమావేశాలు ప్రశాంతంగా సాగుతున్నాయని అన్నారు. నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించే అవకాశం తనకు దక్కినందుకు సంతోషంగా ఉందని అన్నారు.

వాల్మీకి.. బోయలను ఎస్టీల్లో చేర్చండి

సీఎం చంద్రబాబుకు వాల్మీకి ప్రజాప్రతినిధుల వినతి



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న కాలవ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

అనంతపురం/రాయదుర్గం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకి, బోయలను షెడ్యూల్ తెగల్లో చేర్చాలని సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వాల్మీకి సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలోని ఆయన చాంబర్‌కు కాలవ, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, పార్థసారథి వెళ్లి వినతి పత్రం అందజేశారు. వాల్మీకి, బోయలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డారని అన్నారు. ఆరు దశాబ్దాలకుపైగా తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం లభించలేదని అన్నారు. బోయ, వాల్మీకి ప్రజల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ అంశంపై శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ సిఫార్సు మేరకు 2017లో కేంద్రానికి సానుకూల నివేదిక పంపామని అన్నారు. ఈ నివేదికలోని ఆరు అంశాలపై వివరణ కోరుతూ కేంద్ర జనగణన విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రాష్ట్రానికి లేఖ పంపారని అన్నారు. జగన్ ప్రభుత్వం ఈ అంశాన్ని వివాదంలోకి లాగిందని అన్నారు. రాయలసీమలోని బోయ, వాల్మీకులనే ఎస్టీ జాబితాలో చేర్చాలని జగన్ ప్రభుత్వం నివేదించి, ప్రాంతాల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసిందని అన్నారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించారని అన్నారు. బంధుత్వాలు, ఆచారాలతో పాటు సామాజికంగా, ఆర్థికంగా ఒకే విధమైన ప్రమాణాలతో జీవిస్తున్న వారిని ఆ రాష్ట్రం ఎస్టీలుగా గుర్తించగా... మన రాష్ట్రంలో మాత్రం సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కేంద్రం కోరిన ఆరు అంశాలపై త్వరగా సమగ్ర, సానుకూల నివేదిక పంపాలని కోరారు. ఎన్డీయే ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో సమస్య త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు.

9వేల మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలు

● ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటిదాకా 9వేల మెట్రిక్ టన్నుల కంది ఉత్పత్తులు కొనుగోలు చేసినట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. గతేడాది డిసెంబరు రెండోవారం నుంచి రైతు సేవాకేంద్రాల్లో 11 వేల మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలోని 31 కేంద్రాల ద్వారా ఇప్పటిదాకా 7,053 మందితో రూ.60కోట్ల విలువైన 9వేల టన్నుల కంది పంటను కొనుగోలు చేశారు. ఇందులో ఇప్పటిదాకా 5,087 మందికి రూ.40 కోట్ల సొమ్ము జమైందన్నారు. రైతుల నుంచి కంది కొనుగోలు చేసిన వారం నుంచి 10 రోజుల్లోపు డబ్బు జమవుతోందన్నారు.

పప్పుశనగ విక్రయానికి నమోదు చేసుకోండి

పప్పుశనగ ఉత్పత్తులను విక్రయించాలనుకునే రైతులు రైతు సేవాకేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి పేర్కొన్నారు. పప్పుశనగ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. క్వింటా పప్పుశనగ ధరను రూ.5650గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈక్రాపింగ్ చేయించుకున్న రైతులతో మాత్రమే పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తామన్నారు. 14 శాతంలోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పప్పుశనగ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల ఆటల పండుగ



వీల్‌చైర్ పోటీల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

చెన్నేకొత్తపల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): ప్రతిభా దివ్యాంగుల సొసైటీ ఆధ్వర్యంలో చెన్నే కొత్తపల్లిలో మంగళవారం విభిన్న ప్రతిభా వం తుల ఆటలపండుగ ఉత్సాహంగా సాగింది. టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చింతవనం కార్యాలయ ఆవరణలో నిర్వహించా రు. రామగిరి, రొద్దం, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ మండలాలకు చెందిన దివ్యాంగ సభ్యులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన వారికి టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకురాలు మేరి వటముట్టం బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టింబక్టు అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య, సంస్థ మేనేజర్లు రమేశ్‌కుమార్, శ్రీకాంత్, మహాశక్తి సీఈఓ రమీజ, మిళిత మేనేజర్ జయశ్రీ, కో ఆర్డినేటర్ గణేశ్,నాగరాజు, పెద్దక్క, ప్రతిభా డైరెక్టర్లు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.25వేలు

అనంతపురం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,650 పలికనట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6,660, సరాసరి రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

నీ వల్లే నీ భార్య చనిపోయింది

● క్రిమినల్ కేసు పెట్టిస్తా: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): 'ఏమయ్యా..! మీ భార్యకు గర్భంలో సమస్య ఉందని, అలాగే ఉంచితే ప్రసవ సమయంలో ఆమె ప్రాణానికే ముప్పు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు, వైద్యసిబ్బంది, ఐసీడీఎస్, రెవెన్యూ అధికారులు, పోలీసులు చెప్పినా వినరా? ఇపుడు ఏమైంది... మీ భార్య చనిపోయింది. నీపై క్రిమినల్ కేసు పెట్టిస్తున్నా. దీన్ని చూసి మరొకరు ఇలా చేయరు' అంటూ మరణించిన ఓ గర్భిణి భర్తపై డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఫిబ్రవరి నెలలో జరిగిన మాతా శిశుమరణాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తన భార్య మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని గత నెలలో గొడవ చేసిన బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన హనుమంతప్పను పిలిపించారు. డాక్టర్లు, సిబ్బంది ఆధారాలతో ఇచ్చిన నివేదికను చూసిన డీఎంహెచ్ఓ మండిపడ్డారు. అధికారులు చెప్పేది మీ మంచికేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లికి ప్రమాదమని తెలిసినా మూడో బిడ్డ అవసరమా అని గట్టిగా ప్రశ్నించారు. అనారోగ్య సమస్యలతో నీ భార్య తిప్పమ్మ ఫిబ్రవరి 20న చనిపోతే నెపాన్ని డాక్టర్ల మీద రుద్దావ్ ఇది కరెక్టేనా అని నిలదీశారు. పుట్టిన బిడ్డకు కాళ్లు వంకర్లున్నాయని ఐసీడీఎస్ వాళ్లకు ఇచ్చేశావ్..! ముందున్న ఇద్దరు పిల్లలను ఏమి చేస్తావో తెలీదు. నీ వల్లే నీ భార్య చనిపోయిందన్నారు. హనుమంతప్పపై బ్రహ్మసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సంబంధిత డాక్టరు, సిబ్బందిని డీఎంహెచ్ఓ ఆదేశించారు.

● గ్రామాలలో ఉన్న వారికి అవగాహన తక్కువగా ఉంటుంది. అలాంటపుడు అనారోగ్య సమస్యలు ఉన్నపుడు వారికి తెలుగులోనే అర్థమయ్యేలా విపులంగా తెలపాలని డాక్టర్లకు డీఎంహెచ్ఓ ఆదేశించారు. హైరిస్క్ గర్భిణి విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రసవం తర్వాత కూడా తల్లీబిడ్డల ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్లు, సిబ్బందికి డీఎంహెచ్ఓ సూచించారు. సమీక్షలో డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, డీఐఓ డాక్టరు యుగంధర్, డాక్టర్లు శంకర నారాయణ, పార్వతి, ఎంపీహెచ్ఓ లక్ష్మన్న, డెమోలు త్యాగరాజు, గంగాదర్ వివిధ పీహెచ్‌సీల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి

ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకూడదు

● ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టండి
● సిబ్బందికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ ఆదేశాలు



మాట్లాడుతున్న ఎస్ఈ సురేశ్

అనంతపురం న్యూటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని, జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్.. ఏఈ, డీఈలకు సూచించారు. స్థానిక కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని ఏఈలు, డీఈలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బోర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. చేతిపంపులన్నింటినీ వినియోగంలోకి తీసుకరావాలని ఆదేశించారు. ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన అవసరం రాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఈఈ మురళీధర్‌రావు, డీఈలు శ్రీధర్, శ్రీనివాసులు, రెహనా వసీం, రామారావు పాల్గొన్నారు.

లైనింగ్ వద్దు..



నిరసన తెలుపుతున్న జలసాధన సమితి నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు రద్దు చేయాలని జలసాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని పప్పూరు రామాచార్యుల విగ్రహం ఎదుట జలసాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలతో నిరసన చేపట్టారు. ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాకు నీరందించే హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల కోసం జారీ చేసిన 404, 405 జీఓలను వెంటనే రద్దు చేయాలన్నారు. కాలువ వెడల్పు చేయాలని కోరారు. ఈ విషయంలో పార్టీలకతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, కార్యదర్శి ఉపేంద్రకుమార్, రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ లోక్ డివిజన్ ఈఈగా రమణారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ లోక్ డివిజన్ ఈఈగా వెంకటరమణారెడ్డిని నియమించారు. పలువురు డీఈలకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆయా స్థానాలను కేటాయించి ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈగా వెంకటరమణారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఈఈగా రమేష్‌బాబు, మైనర్ ఇరిగేషన్ అనంతపురం ఈఈగా రాము, ధర్మవరం ఈఈగా సురేంద్రనాథ్‌రెడ్డి, పెనుకొండ ఈఈగా గురుమూర్తి, డిప్యూటీ ఎస్ఈగా పార్థసారథి, తుంగభద్ర డ్యాం హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా శశిరేఖ, హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా పెంచలయ్యను నియమించారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి డివిజన్-7 ఈఈగా శ్రీనివాసులు, డిప్యూటీ సీఈగా వెంకటేశ్వర్లు, పెనుకొండ ఈఈగా మురళి, డివిజన్-2 ఈఈగా ఉమామహేశ్వరరావును నియమించారు.

న్యూస్ బాక్స్

బోర్డు సమావేశానికి డైరెక్టర్ హాజరు

అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పద్మశాలి కార్పొరేషన్ తొలి బోర్డు సమావేశం మంగళవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవనంలో నిర్వహించారు. కార్పొరేషన్ ఛైర్మన్ అబద్దయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా నుంచి పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు హాజరయ్యారు.

టిప్‌టాప్ సార్‌పై ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఓ సర్వే అధికారి వసూళ్లు, ఉద్యోగుల పట్ల ఆయన వ్యవహార శైలిపై టిప్ టాప్ సార్ అన్న శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించిన విషయం విదితమే. ఇది ఆయా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇదే క్రమంలో ఆ అధికారి ఎవరు? ఆయన వ్యవహారం ఏంటి? అన్నదానిపై జిల్లా ఉన్నాతాధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సంబంధిత సర్వే విభాగం జిల్లా అధికారులు ఆ అధికారిని పిలిపించి మాట్లాడినట్లు తెలుస్తోంది. ఆ మేరకు వివరణ ఇవ్వాలని సూచించినట్లు ఆయా వర్గాల్లో చర్చజరుగుతోంది.

సోషల్ ఫారెస్ట్ ఇన్‌చార్జి రేంజర్‌గా దీప

అనంతపురం న్యూటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సోషల్ ఫారెస్ట్ అనంతపురం ఇన్‌చార్జి రేంజర్‌గా డిప్యూటీ రేంజర్ దీపాను నియమిస్తూ సీఎఫ్ యశోదాబాయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న రేంజర్ డేవిడ్ సాధారణ బదిలీల్లో భాగంగా మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. దీంతో ఆ స్థానంలో టెరిటోరియల్ రేంజర్ శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. మరో మూడు నెలల్లో ఆయన ఉద్యోగ విరమణ పొందుతుండటంతో, అదనపు బాధ్యతల నుంచి తప్పించాలని సీఎఫ్‌కు విన్నవించారు. స్పందించిన సీఎఫ్ అదనపు బాధ్య తల నుంచి ఆయనను రిలీవ్ చేస్తూ డీఆర్వో దీపాను ఇన్‌చార్జ్ రేంజర్‌గా నియమించారు.

పరిశ్రమల శాఖ జీఎం బాధ్యతల స్వీకరణ

అనంతపురం అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖ జీఎంగా శ్రీనివాస యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జీఎంగా పనిచేస్తున్న శ్రీధర్‌ను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా పనిచేస్తున్న శ్రీనివాసయాదవ్‌ను జిల్లాకు బదిలీ చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివ నారాయణ్‌శర్మను మర్యాద పూర్వకంగా కలిశారు.

నిప్పెందుకు పెడుతున్నారు..?: కమిషనర్



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్రైం, మార్చి18(ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్త కుప్పలకు తరచూ నిప్పు ఎందుకు పెడుతున్నారని నగర కమిషనర్ బాలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో చెత్త కుప్పలకు నిప్పుండటం గమనించి, కార్మికులను మందలించారు. మరోసారి ఇలా జరగ కూడదని ఆదేశాలిచ్చారు. అనంతరం ఒకటో సర్కిల్‌లోని జనశక్తినగర్ సర్వీస్ రోడ్లు, కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్‌లలో పనులను, అక్కడే అన్న క్యాంటీన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అటు నుంచి డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించారు. గతంలో ఉన్నబోర్లకు, పైపులైన్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఈఈ నరసింహులు, ఏఈ హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి: సీపీఐ

శింగనమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి టి. నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మండలంలోని కొరివిపల్లి, చిన్న మట్లగొంది గ్రామాల్లో సీపీఐ గ్రామ కమిటీ ఎంపిక సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సీపీఐ మండ కార్యదర్శి చిన్నప్పయాదవ్, నారప్ప, ఓబుళపతి పాల్గొన్నారు..

రేపట్నుంచి ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీలు గురువారం నుంచి ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు కోటగిరి శ్రీధర్, ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్ మంగళ వారం తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉండే ఫుట్‌బాల్ క్రీడాకారులను మునుపెన్నడూ లేని విధంగా 8 జట్లు(క్లబ్)గా ఏర్పాటు చేశామని, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో పోటీలు ఉంటాయన్నారు. తుంగ భద్ర జట్టు, కొల్లేరు, విశాఖ, పెన్నా, కోరమాండల్, నల్లమల, గోదావరి, వంశధార జట్లు తలపడతాయన్నారు. ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు లీగ్, నాకౌట్ పద్ధతిలో పోటీలు ఉంటాయన్నారు. విజేత జట్టుకు రూ.5లక్షలు ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు.

మెడికల్ షాపులపై డ్రగ్స్ అధికారుల దాడులు

అనంతపురం టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపులపై డ్రగ్స్‌శాఖ అధికారులు మెరుపుదాడులు చేశారు. డ్రగ్స్ అసిస్టెంట్ డైరెక్టరు రమేష్‌రెడ్డి నేతృత్వంలో హనుమన్న (అనంతపురం), కేశవరెడ్డి(మదనపల్లి), ఖలందర్(నంద్యాల) జయరాముడు(రాయచోటి) బృందాలుగా ఏర్పడి మంగళవారం అనంతపురంలోని 15 మెడికల్ షాపులను తనిఖీ చేశారు. ఈ సమయంలో ప్రతిషాపులోను నిబంధనలకు విరుద్ధంగా మందుల అమ్మకాల సాగిస్తున్నట్లు బయటపడింది. ఇందులో 14 మెడికల్ షాపులలో డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్నారని, 12షాపులలో ఫార్మసిస్టులు లేకుండా రోగులకు మందులు అందిస్తున్నారని, 15షాపులలోను బిల్లులు లేకుండాను మందులు విక్రయిస్తున్నారని, 10షాపులలో సరిగా రికార్డులు నిర్వహించడంలేదని గుర్తించినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. వారందరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తామని ఆయన వెల్లడించారు. విషయం తెలిసిన వెంటనే కొందరు షాపులను మూసివేశారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు: సీఐ

గార్లదిన్నె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శింగనమల సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. ఆయన మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలసి ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహ రిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



హలీం రుచులను ఆస్వాదిస్తున్న నగరవాసులు



బౌల్స్‌లో హలీం నింపుతున్న మాస్టర్లు

రంజాన్ ప్రత్యేకం హలీం

- తక్షణ శక్తినిచ్చే ఆహారం.. ఆకర్షిస్తున్న స్టాల్స్
- ఇతర ప్రాంతాల మాస్టార్లతో తయారీ
- ముస్లింలకే కాదు.. అందరికీ ప్రీతిపాత్రం

అనంతపురం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం కోసం ముస్లింలు ఎంతగా ఎదురుచూస్తారో... అంతకంటే ఎక్కువగా ఇతర మతాల వారూ ఎదురుచూస్తుంటారు. అలా ఎదురుచూసేలా చేసేది రంజాన్ ప్రత్యేకం హలీం. రోజంతా కఠోర దీక్షచేసే ముస్లింలు బలవర్థక ఆహారంగా తీసుకునే హలీం అన్ని మతాలవారికి ప్రీతిపాత్రమైంది. అందుకే హలీం విక్రయ కేంద్రాల్లో ముస్లింల కంటే ఎక్కువగా ఇతర మతాలవారే కనిపిస్తుంటారు. రంజాన్ మాసంలో ముస్లింలు పగలంతా కఠిన ఉపవాసదీక్ష చేస్తారు. అందుకోసం అనేక పోషకాలున్న, బలవర్థకమైన హలీంను ఆహారంగా తీసుకుంటారు. హలీం ముస్లింలకు పవిత్ర ఆహారమైనప్పటికీ, దాని రుచితో ఇతరులకు ప్రీతిపాత్రమైందిగా పేరుగాంచింది. దీంతో దుకాణాలు తెరిచీ తెరవగానే వాటి ముందు ముస్లింలతో పాటు ఇతరలూ క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన హలీం కేంద్రాలు 15 సంవత్సరాలుగా అనంతలోనూ అంచెలంచెలుగా విస్తరిస్తున్నాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది రంజాన్ మాసం సందర్భంగా జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో హలీం కేంద్రాలు వెలిశాయి. నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా ప్రధాన పట్టణాలన్నింటిలోనూ హలీం కేంద్రాలు వెలిశాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హలీం, బిరియానీ, ఇరానీ ఛాయ్ మాస్టార్లను పిలిపించి వంటకాలను తయారు చేయిస్తున్నారు. ఆకర్షించే రీతిలో హలీం స్టాల్స్‌ను రూపొందించడంతోపాటు రకరకాల ఆఫర్లతో కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు.



డబుల్ ధమాకా హలీం

ఏడాదికేడాదికీ డిమాండ్ పెరుగుతోంది



అనంతపురం నగరంలో గత 15 సంవత్సరాలుగా ప్రతియేటా హలీం కేంద్రా న్ని నిర్వహిస్తున్నాం. ఏడాదికేడాది డిమాండ్ పెరుగుతోంది. నాణ్యమైన నెయ్యి, డ్రైఫ్రూట్స్, తాజా మాంసంతో హలీంను తయారుచేసి ప్రజలకు అందిస్తున్నాం. అందుకే ప్రజల నుంచి మా హలీంకు విశేషమైన ఆదరణ ఉంది. ఇరానీ ఛాయ్ అంటే ఇష్టపడని వారుండదరు. అందుకే హలీంతోపాటు ఇరానీఛాయ్, షవర్మా స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం. అయితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వ్యాపిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడం వల్ల ఈ ఏడాది చికెన్ హలీం కన్నా మటన్ హలీం కొనేవారు ఎక్కువగా కనిపిస్తున్నారు.

- తాజుద్దీన్, మెహ్‌ఫిల్ అరబిక్ రెస్టారెంట్ నిర్వాహకుడు

తక్కువ ధరలో నాణ్యమైన హలీం



ఏడాకేడాది హలీం సెంటర్లు పెరుగు తూనే ఉన్నాయి. అయితే తక్కువ ధరలో నాణ్యమైన, రుచికరమైన హలీం అందించడ మే మా లక్ష్యం. అందుకే నగరంలోని అన్ని హలీం సెంటర్ల కన్నా తక్కువ ధరతోనే చికెన్, మటన్ హలీంను ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. ముస్లింలతో పాటు హిందువులు కూడా మా హలీంను ఎంతో ఇష్టంగా ఆరగిస్తుంటారు. ఎక్కడా లేనివిధంగా మా వద్ద ప్లేట్‌తో పాటు సింగిల్, జంబో, బకెట్ కొలతల్లోనూ హలీంను అందిస్తున్నాం. ఈ ఏడాది ప్రత్యేకంగా హలీంతో పాటు కోడిగుడ్డు, చికెన్-65ను జోడించి డబుల్ ధమాకా హలీంను ప్రవేశపెట్టాం.

- ఇషాక్, ఆలియా అరేబియన్ రెస్టారెంట్

అభివృద్ధి పనుల్లో లోపాలకు తావివ్వకండి

- పీఆర్ పీఐయూ ఈఈ బాల సుబ్బారావు

అనంతపురం న్యూటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఆర్ పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో ఎక్కడా లోపాలు ఉండకూడదని ఈఈ బాల సుబ్బారావు డీఈలకు సూచించారు. ఎస్‌క్యూఎం, ఎన్‌క్యూఎం బృందాల పరిశీలన నేపథ్యంలో జిల్లాలో జరుగుతున్న ప్రాజెక్టు పనులపై సంబంధిత సిబ్బందితో ఆయన మంగళవారం పీఐయూ కార్యాలయంలోని ఈఈ చాంబర్‌లో సమీక్షించారు. ఎన్‌క్యూఎం అధికారి దేవరాజ్ బుధవారం రానున్న సందర్భంగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఆయన జిల్లాలో నాలుగు బ్రిడ్జిల పనులు పరిశీలించనున్నట్లు తెలిపారు. అందులో బాగంగా గుత్తి మండలంలో నిర్మిస్తున్న రెండు బ్రిడ్జిలతో పాటు పెద్దవడుగూరు వద్ద, నారాయణపురం నుంచి కోటంకకు వెళ్లే మార్గంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈఈ టూ పీఏ డీఈ భరత్ ప్రకాష్‌రెడ్డి, అనంతపురం డీఈ రామచంద్రారెడ్డి, గుత్తి డీఈ మురళీధర్, జేఈ జయకర్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్

అనంతపురం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద ఏపీ విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ గౌడ్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా మీటర్ రీడర్లు విద్యుత్ సంస్థను నమ్ముకుని జీవనం సాగిస్తున్నా రన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మీటర్ రీడర్లు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్తు కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులురమాదేవి, విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు సలీం, ఆనంద్, విజయకుమార్, భాస్కర్, నవాజ్, కిషోర్, సోమశేఖర్, కళ్యాణ్, లక్ష్మీనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ

అనంతపురం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్క రించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని కందుకూరులో జరుగుతున్న ఉపాధి పనులు సీఐటీయూ నాయకులు మంగళవారం పరిశీలించారు. పది వారాలుగా బిల్లులు చెల్లించలేదని కూలీలు వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ... కూలీలకు పది వారాలుగా బిల్లులు చెల్లించకుంటే వారి జీవనం ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. ఎండకాలం నేలలు గట్టిగా ఉండటం వల్ల ప్రభుత్వం చెప్పిన ప్రకారం కూలీలు పడటం లేదన్నారు. కావున కూలీలకు అనుకూలమైన పనులు కల్పించి రోజుకు రూ. 400 కూలీ ఇవ్వాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

- పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు ప్రతిశాఖ అధికారులు ప్రణాళిక బద్ధంగా పనిచేసినపుడే మంచి ఫలితాలు సాధించగలుగుతామని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం అధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై ఆరాతీశారు. ప్రభుత్వ పథకాల అమలువిషయంలో అందరూ చిత్తశుద్ధితో పనిచేసి జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. అలాగే పరీక్షల సమయంలో పదో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులు కల్పించాలన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. భూ సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల ఫామ్స్ దరకాస్తుల పరిశీలనను పెండింగ్ లేకుండా పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఎంతో అవసరం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

ఆత్మకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. హుండయ్ అనుబంధ సంస్థ మోబీస్ ఇండియా మాడ్యూల్ ప్రయివేట్ కంపెనీ పలు పోలీస్ స్టేషన్లకు సీసీ కెమెరాలు వితరణ చేశారు. వాటిని ఎస్పీ ఆ కంపెనీ ప్రతినిధులతో కలిసి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయా పోలీస్ స్టేషన్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మోబీస్ ఇండియా కంపెనీ రూ. 33లక్షలు విలువ చేసే 300 అత్యాధునిక సీసీ కెమెరాలను వితరణ చేయడం అభినందనీయమన్నారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోబీస్ ఇండియా మాడ్యూల్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి హుమిన్‌కో, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీఎస్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ ఇన్‌చార్జి సింధూజ,రూరల్ డీఎస్పీ వెంకటేశులు, ఇటుకల పల్లి సీఐ హేమంత్‌కుమార్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా అనర్థాలపై అవగాహన

ఆత్మకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నాటుసారా వల్ల జరిగే అనర్థాలపై మంగళవారం పంపనూరుతండా గ్రామంలో ఎక్సైజ్ పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. నాటుసారా వాడకం వల్ల కలిగే సమస్యలను తెలియజేసే పోస్టర్లను విడుదల చేసి, వివరించారు. నవోదయ 2.0 కార్యక్రమ ఉద్దేశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కళాజాతా బృందం ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాధికారి రామమోహన్ రెడ్డి, రేవతి, మంగశ్రీరామ్, జాకీర్ హుసేన్, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

పొలాన్ని తవ్వారు... వదిలేశారు

- చదును చేసి ఇవ్వమంటే బెదిరిస్తున్నారు
- ఓ దళిత రైతు ఆవేదన



ఎర్రమట్టి కోసం పొలాన్ని తవ్విన దృశ్యం

శింగనమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అనంతపురం-తాడిప్రతి చేపట్టిన పనులకు ఎర్రమట్టి కోసం నా పొలాన్ని తవ్వారు. మళ్లీ చదును చేయకుండా అలాగే వదిలేశారు. అడిగితే బెదిరిస్తున్నారు. తనకు ఎలాగైనా న్యాయం జరిగేలా చూడాలి.' అని చంద్రశేఖర్ అనే దివ్యాంగుడైన దళిత రైతు వేడుకుంటున్నాడు. మండలంలోని పెద్ద జలాలపురానికి చెందిన చంద్రశేఖర్ అనే దళిత రైతు దివ్యాంగుడు. మండలంలోని జూల్కాకాలువ రెవెన్యూ పొలంలో సర్వే నంబర్ల 307-5, 375-1లలో అతడికి ఎనిమిదెకరాల డి- పట్టా పొలం ఉంది. అదంతా కొండ ప్రాంతం. ఎర్రమట్టి ఉంది. దీంతో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అనంతపురం-తాడిప్రతి చేపట్టిన పనులకు ఎర్రమట్టి కోసం కాంట్రాక్టరు, రోడ్డు పనులు చేసే కంపెనీ ప్రతినిధులు అతడితో ఒప్పందం చేసుకున్నారు. భూమిలోని ఎర్రమట్టి తవ్వి తరలించుకుంటామని, మళ్లీ భూమిని చదును చేయిస్తామ ని వారు హామీ ఇచ్చి ఎర్రమ ట్టి తవ్వకాలు చేపట్టారు. అతడి పొలంలో దాదాపు ఎకరా స్థలంలో వంద మీటర్ల గుంత తవ్వి ఎర్రమట్టిని తరలించారు. పనులు అయిపోయి నాలుగు నెలలు గడిచింది. భూమి చదును చేయడం గురించి వారు పట్టించుకోలేదు. దీంతో చంద్రశేఖర్ కాంట్రాక్టరు, కంపెనీ సిబ్బంది వద్దకు వెళ్లి గట్టిగా అడిగాడు. భూమి చదును చేపట్టకపోగా, బెదిరింపులకు దిగుతున్నారని రైతు చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన పొలంలోని అంత పెద్ద గుంతను పూడ్చడానికి రూ.25లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని కన్నీరుమున్నీరు అవుతున్నాడు.

ఇప్పుడు మాట మార్చారు



మీ భూమి కొండలో ఉంది. జాతీయ రహదారి పనుల కోసం అందులోని ఎర్రమట్టిని తీసుకెళ్లి, నీ భూమిని చదును చేసి సాగుకు అనుకూలంగా చేస్తామని కంపెనీ సిబ్బంది, కాంట్రాక్టర్ నాతో ఒప్పందం చేసుకున్నారు. తన భూములకు రాయల్టీ చెల్లించి ఎర్రమట్టిని తరలించారు. ఒకే ప్రాంతంలో దాదాపు ఎకరా భూమిలో 100 మీటర్లు లోతు వరకు గుంతలను తవ్వి మట్టిని తరలించారు. పనులు పూర్తి కావడంతో నాలుగు నెలల నుంచి మట్టి కోసం రాలేదు. ఆ గుంతలను చదును చేయాలని వారిని అడిగితే, అక్కడికి వెళ్లడానికి మీ గ్రామానికి చెందిన రైతు దారి ఇవ్వడం లేదని ఇప్పుడు చెబుతున్నారు. గట్టిగా అడిగితే బెదిరింపులకు దిగుతున్నారు. అంత పెద్ద గుంతలు పూడ్చి, భూమిని చదును చేసేందుకు రూ.25లక్షలు నుంచి రూ.30 లక్షలు ఖర్చు అవుతుంది. నాకు అంత ఆర్థిక స్థోమత లేదు. వారు సహకరించకుంటే ఆత్మహత్యే శరణ్యం. నేను టీడీపీ కార్యకర్తను కావడంతో భూ మి చదును విషయంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు అడ్డుపడుతున్నారు.

-చంద్రశేఖర్, రైతు, పెద్ద జలాలపురం

వైభవంగా వ్యాసరాయ ఆరాధనోత్సవం



అలంకరణలో బృందావనాలు

అనంతపురం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పాతూరులోని బృందావన ఆంజనేయస్వామి (చిన్న ఆంజనేయస్వామి) దేవస్థానంలో మంగళవారం వ్యాసరాయ స్వామి 486వ ఆరాధనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అక్కడి నరసింహస్వామి మూల విరాట్‌కు, రాఘ వేంద్రస్వామి, వ్యాసరాయ బృందావనాలకు నిర్మాల్య విసర్జన, అష్టోత్తర పారాయణం, పంచామృతాభిషేకాలు, వేదపండితుల ప్రవచనాలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం సాయి ట్రస్టు సమన్వయంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద దాదాపు 600 మందికి అన్నదానం చేశారు. రాత్రికి ఆలయ ఆవరణలో స్వస్తి వాచనం నిర్వహించారు. కార్యక్రమంలో మఠాధికారి శ్రీకాంత్, మేనేజర్ హరినారాయణరావు, డాక్టర్ రఘునాథ్, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, భక్తులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలి

- ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం విద్య, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లను 50 శాతానికి పెంచుతూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రంలో బీసీలకు 29 శాతం నుంచి 42 శాతానికి అన్ని రంగాల్లో రిజర్వేషన్లు పెంచుతూ శాసనసభ, మండలిలో బిల్లు తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపిందన్నారు. ఏపీలోనూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపాలని కోరారు. త్వరలో సీఎం చంద్రబాబును కలసి విన్నవిస్తామని తెలిపారు. బీసీ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను ఆయనకు వివరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు బీసీ బిల్లు పెడితే...బీసీలు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరేష్, పవన్, అభిరామ్, ఈశ్వరయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయండి

- ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, మతపెద్దలు

అనంతపురం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పాతూరు పాపాస మకాన్‌లో ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గంధం ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం సాయం త్రం పాపాస మకాన్ వద్ద ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహబూబ్‌బాషా మాట్లాడుతూ... ఏప్రిల్ 3న గంధం, 4న ఉరుసు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు మతగురువులు హాజరై ఆధ్యాత్మిక సందేశాలు ఇస్తారన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలు విరివిగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జాకీర్ హుస్సేన్, యంఐయం దాదు, టిప్పు సుల్తాన్ జాకీర్, మతపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



గుంతలు పడిన గంగలకుంట రోడ్డు

రాప్తాడు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాప్తాడు నుంచి గంగలకుంటకు వెళ్లే తారురోడ్డుకు మరమ్మతు లు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో తారురోడ్డుకు అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

టమోటా కిలో రూ.9

అనంతపురం రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 9తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 120 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.

సంక్షిప్త వార్తలు

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అంకరణలో రేణుకా ఎల్లమ్మ

పామిడి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాణినగర్‌లో గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తు లు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రాదాలు స్వీకరించారు.

మారెమ్మ దేవతకు..


ప్రత్యేకాలంకరణలో మారెమ్మ

శెట్టూరు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామంలో గల మారెమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. తొలుత అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత గ్రామస్థులు ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు

ఉరవకొండ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచుపల్లిలో ఎర్రితాతస్వామి రథోత్సవాన్ని పరిష్కరించుకుని మంగళవారం టీడీపీనేత పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో రాతిదూలం లాగుడు పోటీలను నిర్వహించారు. ఇందులో ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ. 10వేలను కౌకుంట్లకు చెందిన శీనప్ప వృషభాలు దక్కించుకున్నాయి. రెండో బహుమతి రూ.5వేలను మైలారాంపల్లికి చెందిన లాలెప్ప వృషభాలు, మూడో బహుమతి రూ.3 వేలను రాచేపల్లికి చెందిన సుంకన్న వృషభాలు గెలుపొందాయి. నాయకులు కేశన్న, నారాయణస్వామి, శంకర్, ఎర్రిస్వామి, గంగన్న పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

విడపనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద నుంచి పోలీస్ స్టేషన్ దారి వరకూ పలు చోట్ల సీసీ కెమెరాలను మంగళవారం ఎస్ఐ ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామ పెద్దల సహకారంతో మండల కేంద్రంలో దాదాపుగా 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో కిరాణా షాపులు, హోటళ్ళ, ప్రధాన రాహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఎక్కడా ఎలాంటి నేరాలు జరగ కుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

చెరువులోకి చేప పిల్లల విడుదల

బొమ్మనహాళ్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామ చెరువులోకి మత్స్యశాఖ అధికారులు మంగళవారం చేపపిల్లలను వదిలారు. తహసీల్దార్ మునివేలు సమక్షంలో 16,400 చేపపిల్లలను పీఎంఎంఎస్‌వై పథకం కింద 40 శాతం సబ్సిడీతో వదిలారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు పక్కీరప్ప, డిస్ట్రిబ్యూటరీ ఉపాధ్యక్షులు మల్లికార్జున, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం చెరువులో 8500, రంగసముద్రం చెరువులో 10,800, కలుగోడు చెరువులో 11500, గుమ్మఘట్ట చెరువులో 11142 చేపపిల్లలను మత్స్యశాఖ అధికారులు వదిలారు.

నంది విగ్రహం అపహరణ

పెద్దవడుగూరు, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురం గ్రామంలో వంక గడ్డన ఉన్న రాతి నంది విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున చోరీ చేశారు. పూర్వకాలంలో గ్రామపెద్దలు స్థానిక వాగు సమీపంలో నంది విగ్రహం ఏర్పాటు చేశారని, ఒకటిన్నర టన్ను బరువున్న ఆ విగ్రహాన్ని దుండగులు చోరీ చేశారని గ్రామస్థులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

పనిభారం తగ్గించాలని వినతి

కణేకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తమపై పని భారం తగ్గించాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాసులును మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు గంగాధర, తిమ్మప్ప, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి పర్యటన

విడపనకల్లు, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి, పాల్తూరు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మంగళవారం పర్యటించారు. హావళిగిలోని రైతులు గడ్డి జొన్న విత్తనాన్ని సాగు చేసి దళారుల చేతిలో మోస పోతూ ఉండటంపై రైతులతో కలిసి విచారించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే సీజన్‌లో అయినా రైతులు సాగు చేసే విత్తన జొన్నకు కంపెనీ ప్రతినిధులతో ముందస్తుగా అగ్రిమెంట్లు చేయించుకోవాలని సూచించారు. అలా చేస్తే రైతులు పండించిన పంటను కంపెనీ ప్రతినిధులే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. దీంతో ఏ రైతు నష్టాలు పాలు కాకుండా ఉంటారన్నారు. ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రి దృష్టికి రైతుల సమస్యలు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎం కొండాపురం అనిల్‌చౌదరి కోరారు. విజయవాడలో మంగళవారం ఆయన మంత్రిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న డీ పట్టా భూములు, మ్యుటేషన్‌కు సంబంధించి సమస్యలు, పది ఎకరాల భూమిపైన ఉన్న రైతులకు రేషన్‌కార్డు అర్హత కలిగించే విషయాలను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

గడ్డి వామి దగ్ధం

గుంతకల్లుటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాల తండాలో రైతు లాలునాయక్‌కు చెందిన గడ్డివామి దగ్ధమైంది. లాలూనాయక్ తన పొలం పక్కనే పశుగ్రాసాన్ని వామిగా వేసుకున్నాడు. అయితే మంగళవారం పొలం వద్ద విద్యుత్‌స్తంభం నుంచి మంటల చెలరేగి గడ్డివామి మీద పడ్డాయి. దీంతో వామి మొత్తం కాలిపోయింది. బాధిత రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. వెంటనే వారు వచ్చి మంటలను దాదాపు అదులోకి తెచ్చారు. రూ.30వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు లాలునాయక్ తెలిపాడు.

ఈదురుగాలులకు నేలకొరిగిన బీరపంట


దెబ్బతిన్న బీరపంటను చూపుతున్న రైతు

బెళుగుప్ప, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండాలో విజయ్‌కుమార్ నాయక్‌కు చెందిన బీర పంట మంగళవారం ఉదయం వీచిన ఈదురుగాలులకు నేలకొరిగింది. దీంతో రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. రెండున్నర ఎకరాల్లో బీర సాగు చేశానని, ఈదురుగాలులకు ఎకరాలోని పంట నేలకొరిగిందని చెప్పారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సచివాలయానికి తాళం

సచివాలయ కార్యదర్శి తీరుపై సర్పంచ్ ఆగ్రహం

వైసీపీ నాయకులను ఉసిగొల్పుతున్నారని నిరసన


సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచు వరలక్ష్మి, భర్త బొజ్జే నాయక్ తదితరులు

గుంతకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సచివాలయ కార్యదర్శి వైసీపీ నాయకులను తమపైకి ఉసిగొల్పి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ నక్కనదొడ్డి సర్పంచు మంగళవారం గ్రామ సచివాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఉదయమే సర్పంచ్ వరలక్ష్మి, ఆమె భర్త బొజ్జే నాయక్ సచివాలయానికి వచ్చి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేసిన పనికి పంచాయతీ తీర్మానం చేయడానికి రావాలంటే కార్యదర్శి సుమలత సమ్మతించడంలేదని ఆరోపించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అత్యవసరంగా మరమ్మతులు చేయించగా, తనకు చెప్పకుండా పని చేస్తే బిల్లు పెట్టనిచ్చేది లేదంటూ తమతో గొడవకు దిగుతోందన్నారు. రూ. 70 లక్షలు అక్రమంగా డ్రాచేశారంటూ స్థానికుల వద్ద కార్యదర్శి చెడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆమె చెప్పిన మేరకు రూ. 70 లక్షలు ఎక్కడ డ్రాచేశామో చూపాలని నిలదీశారు. రూరల్ పోలీసులు సచివాలయం వద్దకు చేరుకుని సచివాలయ తాళాలను తీయించారు. ఈ విషయంగా ఈఓఆర్డీ నాగభూషణం మాట్లాడుతూ నక్కనదొడ్డి పంచాయతీ బిల్లులను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని, సమస్య ఉంటే సర్పంచు తమకు దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన వివరణ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

కూడేరు, మార్చి 18, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై మండలకేంద్రంలో దళితులు, దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ , ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక్క ఏపీలోనే ఎస్సీవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపిందన్నారు. దీన్నిబట్టి చూస్తే దళితుల అభ్యున్నతికి సీఎం, డిప్యూటీసీఎం, ఆర్థిక మంత్రి కృషి చేస్తున్నారని అర్థమవుతోందని చెప్పారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. సర్పంచు లలితమ్మ, దళిత సంఘాల నాయకులు కొర్రకోడు కుంటెన్న, లక్ష్మన్న, రామాంజనేయులు, కావేరి నాగేంద్ర, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో సంబరాలు


కేక్ కట్ చేస్తున్న కౌన్సిలర్లు తదితరులు

తాడిపత్రి, మార్చి18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఎన్నికలు జరిగి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, కౌన్సిలర్లు చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జేపీసీఆర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 76మున్సిపాలిటీల్లో తాడిపత్రి మున్సిపాలిటీ టీడీపీ గెలిచిందంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. దీంతో ఇక్కడి ప్రజలు మా కుటుంబంపై పెట్టుకున్న నమ్మకం మరోసారి రుజువైందన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో ఇంత అభివృద్ధి జరిగిందంటే కౌన్సిలర్లు, అధికారులు ప్రజలు సహకరించడం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు.

సర్వేలను వేగవంతం చేయండి: ఆర్డీఓ


సర్వేలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ వసంత్‌బాబు

శెట్టూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న పది రకాల సర్వేలను సచివాలయ సిబ్బంది వేగవంతం చేయాలని ఆర్డీఓ వసంత్‌బాబు ఆదేశించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామారావు ,సచివాల య సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడా రు. శెట్టూరులో సర్వేలు నత్తనడకన జరుగుతుండడానికి గల కారణాలను ఆరా తీశారు. ఇప్ప టి నుంచైనా వేగవంతం చేయాలని సూచించారు.

రాయదుర్గంరూరల్: సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న సర్వేలను మూడురోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ కొండన్న సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఈ మేరకు సూచనలు చేశారు.

గుత్తి సబ్‌జైలు తనిఖీ

గుత్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ శివప్రసాద్‌యాదవ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి బ్యారక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్ రూంను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. తర్వాత మాట్లాడుతూ జైలు ఆవరణలో కంపోస్ట్ యార్డు ఏర్పాటు చేయాలని సబ్ జైలర్ మహేశ్వరుడికి సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది గంగాధర్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం

బొమ్మనహాళ్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లబ్ధిదారులకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి రేషన్ షాప్‌లో డీలర్ పేరు, మొబైల్ నెంబర్, స్టాక్ నిల్వలు, పంపిణీ వివరాలనె బోర్డులో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలక్రిష్ణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్, వీఆర్‌ఓ నాగరాజురావు తదితరులు పాల్గొన్నారు.

నగదు చోరీ

రాయదుర్గంరూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఊరువాకిలి వద్ద మంగళవారం సాయంత్రం నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందగా కేసు నమోదు చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన వడ్డె కృష్ణ పట్టణంలోని ఎస్‌బీఐలో మహిళా సమైక్య సంఘం సభ్యురాలికి చెందిన రూ. లక్ష పది వేల నగదును డ్రా చేశాడు. ఆ మొత్తాన్ని ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగ్‌లో పెట్టుకొని గ్రామానికి బయలుదేరాడు. స్థానిక ఊరువాకిలి సమీపంలోని కూల్ డ్రింక్ షాప్ వద్ద వాహనం నిలిపి కూల్ డ్రింగ్ తాగాడు. అనంతరం ద్విచక్రవాహనం వద్దకు వచ్చి చూడగా నగదు కనిపించలేదు. చోరీ అయినట్లు గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే జయరాం


దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కుటుంబసభ్యులు

గుంతకల్లుటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని కనక దుర్గమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే పేరిట పూజలు, అర్చనలు జరిపించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

ఇఫ్తార్ విందు


భోజనాన్ని వడ్డిస్తున్న వెంకట శివుడు యాదవ్, గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పరశురాముడు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు భోజనాలు వడ్డించారు. తర్వాత మాట్లాడుతూ మైనార్టీలకు గత టీడీపీ హయాంలో చేపట్టిన పథకాలన్నీ త్వరలో అమలౌతాయని వెంకట శివుడు యాదవ్ పేర్కొన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

9మంది పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పడమటిగేరిలో మంగళవారం 9మంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.67890 నగదు, 10సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పడమటిగేరిలో పేకాట కేంద్రంపై దాడులు నిర్వహించామన్నారు. ఇందులో పేకాట ఆ డుతున్న 9 మందిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంతో యువకుడి మృతి


సతీష్ (ఫైల్)

బెళుగుప్ప మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తగ్గుపర్తి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బెళుగుప్ప మండలకేంద్రానికి చెందిన సతీష్ (18) తన స్నేహితుడు కనగానిపల్లి మండలం భానుకోటకు చెందిన పవన్‌తో కలిసి సోమవారం బైకుపై ఉరవకొండ మండలం వైరాంపురంలోని ఎర్రితాత రథోత్సవానికి వెళ్లారు. ఉత్సవం అ నంతరం రాత్రి సమయంలో ఇద్దరూ బెళుగుప్పకు బయలుదేరారు. కాగా తగ్గుపర్తి సమీపంలో అదుపుతప్పి హంద్రీనీవా కాలువలో బైకు తో సహా పడిపోయారు. ఇద్దరూ తీవ్రంగా గాయపడగా.. స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సతీష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రాందాసు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు తప్పవ్

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ లేఅవుట్లపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో 36 అక్రమ లేఔట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిల్లో ప్రజలు ఎవరూ కూడా ప్లాట్లు కొనరాదని సూచించారు. అక్రమ లేఔట్‌లలో ఇల్లు నిర్మించుకున్న వారికి నోటీసులు అందజేశామని తెలిపారు. నోటీసులకు స్పందించకపోతే వారిపై చార్జిషీట్ వేసి కోర్టు ద్వారా మున్సిపాల్టీకి రావాల్సిన దానికన్నా ఎక్కువ శాతం వసూలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

డిగ్రీ కళాశాల పరిశీలన

గుంతకల్లు టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అకాడమిక్ అడిట్ బృందం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో జరిగిన విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన, మౌలికసదుపాయాలు, అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించడానికి ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు క్రాంతికుమార్, అనంతపురం కేఎస్ఎస్ ప్రభుత్వ కళాశాల ఆంగ్లఅధ్యాపకురాలు సైఖ్యాపర్వీన్ వచ్చారు. కళాశాలలోని రికార్డులు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్ గదులు, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, వర్చువల్ క్లాస్ రూమ్‌లను పరిశీలించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అన్ని అంశాలపై పూర్తిస్థాయి సమీక్ష చేసి కళాశాలకు ఏ గ్రేడ్‌ను ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

గుంతకల్లుటౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పోలింగ్ బూత్ సర్దుబాట్లు, పోలింగ్ బూత్‌ల పెంపు తదితర అంశాలపై సలహాలు, సూచనలు రాజకీయ నాయకులు తెలిపారు. ఆధార్‌తో లింక్ డబుల్ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరారు. తహసీల్దారు రమాదేవి, కమిషనర్ నయీమ్ అహ్మద్, గుత్తి,పామిడి, తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రజాపురం శివారులోని 67వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీపురం గ్రామానికి చెందిన రాజేష్ మంగళవారం తెల్లవారుజామున బైక్‌పై రజాపురానికి బయలుదేరాడు. గ్రామశివారులోకి రాగానే మట్టి కుప్పను తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

దుకాణాలపై అధికారుల దాడులు

పామిడి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిరాణాషాపులు, ఎలక్ట్రికల్ షాపులపై లీగల్ అండ్ మెట్రాలజీ సీఐ వైజీ శంకర్ మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీసీ రోడ్డులోని గణపతి కిరాణాషాపులో తినుబండారాలుపై సరైన తేదీలు, ధరలు లేకపోవడంతో రూ.15వేలు అపరాధ రుసుం విధించారు. అలాగే ఎలక్ట్రికల్ షాపులో తయారీ కంపెనీ వివరాలు సక్రమంగా లేకపోవడంతో రూ. 20వేలు అపరాధ రుసుం విధించారు. తూకాలు, కొలతలు, నిర్ణీత ధరలు, తయారీ వివరాలు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పన్ను వసూళ్లపై శ్రద్ధ పెట్టాలి

గుత్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో పన్నుల వసూళ్ల పట్ల శ్రద్ధ పెట్టాలని నోడల్ అధికారి చంద్రకళ సూచించారు. పట్టణంలో 10వ సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీచేశారు. అనంతరం పన్ను వసూళ్లకు చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు ఇచ్చారు.

చలో తిరుపతి పోస్టర్ల విడుదల

విడపనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23వ తేదీన చేపట్టిన చలో తిరుపతి కార్యక్రమ పోస్టర్లును మాలమలహానాడు నాయకులు మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపి మాలలను అన్యాయం చేస్తోందన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 23 న మాలల ఆధ్వర్యంలో తిరుపతిలో సంహగర్జన జరగనుందన్నారు. మాలలు అధికసంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు వీరేష్, గోవిందు, సుంకన్న, శేఖర్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

విడపనకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ అధికారులు బాల్య వావాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషినల్ సీడీపీఓ ఎల్లమ్మ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారమన్నారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. సూపర్ వైజర్ ఉమారాణి, సర్పంచ్ రామాంజనేయులు సీడీపీఓ డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని నందలపాడులో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ బాల్యవివాహాలు, లింగ వివక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

బెళుగుప్ప, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ చౌకధాన్యపు 4వ డిపోను మంగళవారం సీఎస్‌డీటీ బాషా తనిఖీ చేశారు. సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేశారు. ఈయన తో పాటు వీఆర్వో యర్రిస్వామి వున్నారు.

35.2 టన్నుల రేషన్ బియ్యం సీజ్


పట్టుబడిన రేషన్ బియ్యంతో సివిల్‌సప్లై, పోలీసు అధికారులు

యాడికి, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఒక గోడౌన్‌పై రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 35.2టన్నుల రేషన్ బియ్యం సీజ్‌చేశారు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సీఐ ఈరన్న తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. యాడికి సమీపాన ఉన్న ఒక గోడౌన్‌లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 30కిలోల బస్తాలు 1175 సీజ్‌చేసినట్లు తెలిపారు. ఆ బియ్యం 35.2టన్నులు ఉన్నాయన్నారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీటిని సివిల్‌సప్లై అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ మారుతీప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో అనిల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గుంతకల్లుటౌన్,మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే నారా రామమూర్తి నాయుడు జయంతి పురస్కరించుకుని నారా రోహిత్ అభిమాన సంఘం నాయకులు కాంతారావు, సతీష్, బండారుశివ, బండారుపులి, రంగారావు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని టీడీపీ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామిముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తర్వాత రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్లను అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఈనెల 19వ తేదీ డయల్‌యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేనేజర్ శంకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు పలు సలహాలు, సూచనలను 9959225856 కు ఫోన్ చేసి తెలపాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం

పుట్లూరు, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలో ఎన్‌హెచ్ 544డీ జాతీయ రహదారి పనులను మంగళవారం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రోడ్డు పనులను ఎవరూ కూడా నిలపరాదన్నారు. రోడ్డులో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

గుత్తి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. నీటిని సరఫరా ట్యాంక్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ పైప్‌లైన్లు లీకేజీ ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే పాతమున్సిపల్ కార్యాలయంలోని వాటర్‌పంప్ హౌస్‌ను పరిశీలించి నీటి సరఫరాపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.